సాక్షి
నిజామాబాద్
ఆదివారం । 2 । జూలై । 2023



వేకువజాము నుంచే..
మోర్తాడ్ మండలం సుంకెట్‌లోని ఇసుక పాయింట్ నుంచి వేకువజాము నుంచే యథేచ్ఛగా ఇసుకను తరలిస్తున్నారు.
- 8లో ▸



ట్రాఫిక్ జామ్
మాక్లూర్ మండలం అడవిమామిడిపల్లి రైల్వే బ్రిడ్జి వద్ద రోడ్డు మరమ్మతుల వల్ల శనివారం భారీగా ట్రాఫిక్ జామ్ అయ్యింది.
- 8లో ▸

గరిష్టం/కనిష్టం
34.8 /24.9

వాతావరణం
ఆకాశం మేఘావృతమవుతుంది. ఉదయం శీతలగాలులు వీస్తాయి. ఓ మోస్తరు నుంచి భారీ వర్షాలు కురిసే అవకాశాలున్నాయి.

గోరింట.. ఆరోగ్య పంట!

చేతులకు మైదాకు పెట్టుకుంటే ఆ అందమే వేరు. అందుకే మైదాకును ఇష్టపడని మగువలు ఉండరు. పండుగలు, పర్వదినాలు, శుభకార్యాల్లో మహిళలు మైదాకు పెట్టుకునేందుకు మక్కువ చూపుతారు. ఇది ఆచారంగానూ, సంస్కృతిలో భాగంగానూ భావిస్తారు. ముఖ్యంగా ఆషాఢ మాసంలో మైదాకు పెట్టుకునేందుకు మహిళలు, యువతులు ఇష్టపడతారు. ఈ మాసంలో గోరింటాకు పెట్టుకోవడం ఆనవాయితీగా వస్తున్నది. ఆషాఢంలో వర్షాలు పడడం, వాతావరణ మార్పులతో చర్మ వ్యాధులు, అనారోగ్య సమస్యలు వచ్చే అవకాశం ఉంటుంది. మైదాకు పెట్టుకోవడం వల్ల ఈ సమస్యల నుంచి ఉపశమనం పొందేందుకు గోరింటాకు చాలా బాగా పనిచేస్తుంది. చిన్నా, పెద్ద తేడా లేకుండా ఎంతో ఇష్టంగా పెట్టుకునే ఈ గోరింటాకు అందంతో పాటు ఆరోగ్యం కూడా కాపాడుతుంది.



బోధన్ పట్టణంలో ఆషాఢం గోరింటాకు వేడుకల్లో పాల్గొన్న మహిళలు

● మక్కువ చూపుతున్న మహిళలు ● ఆషాఢంలో గోరింటాకుకు ఎంతో ప్రాధాన్యం

సాక్షి ప్రతినిధి, నిజామాబాద్: భారతీయ సాంప్రదాయంలో గోరింటాకుకు ఎనలేని ప్రాధాన్యం ఉంది. తెలుగింట గోరింటాకు పెట్టుకునేందుకు మహిళలు ఉత్సాహం చూపుతారు. ఆషాఢ మాసం వచ్చిందంటే చాలు 'గోరింటాకు వేడుకలు' సైతం నిర్వహించుకుంటున్నారు. పల్లెల్లో తప్పనిసరిగా వేడుకలు నిర్వహిస్తుండడం ఆనవాయితీగా వస్తోంది. ప్రస్తుత ఆషాఢ మాసంలో బోధన్ పట్టణంలో వివిధ కాలనీల్లో మహిళలు ప్రత్యేకంగా గోరింటాకు ఉత్సవాలు నిర్వహించుకుంటున్నారు. అదేవిధంగా అనేక పల్లెల్లో సైతం అందరూ ఒకచోట కూర్చుని గోరింటాకు పెట్టుకునే ఈ పురాతన సంస్కృతిని కొనసాగిస్తున్నారు. ఉత్తర భారతంలో ఉన్న మెహెందీ సంస్కృతిని ఇక్కడ వ్యాపారంగా మార్చినప్పటికీ స్థానిక పల్లెల్లో మాత్రం ఆషాఢం గోరింటాకు ఉత్సవాలకు మంచి ఆదరణ ఉంది. పెళ్లి పేరంటాలకు ఇక్కడ సైతం వివిధ రకాల కోన్లతో మెహెందీ ఫంక్షన్లు చేస్తున్నప్పటికీ ఆషాఢంలో మాత్రం చెట్టు నుంచి తెంపిన స్వచ్ఛమైన గోరింటాకును చింతపండు వేసి రుబ్బి చిన్నపిల్లలు, యువతులు, మహిళలు పెట్టుకుంటున్నారు. పల్లెల్లో చెట్ల నుంచి గోరింటాకు కోసుకొచ్చి పెట్టుకుంటుండగా, నగరాలు, పట్టణాల్లో బహుళ అంతస్తుల నివా సాలు ఉన్నప్పటికీ పల్లెల నుంచి గోరింటాకు తెప్పించుకునే వారు సైతం బాగానే ఉంటున్నారు.



గోరింటాకు తెంపుతున్న మహిళలు

పౌరాణిక ప్రాశస్త్యం ప్రకారం సీతమ్మతల్లి వరం

ఆషాఢంలో చేతినిండా గోరింటాకు పెట్టుకుంటే కష్టాలుండవని, ఇందుకు సీతాదేవి ఇచ్చిన వరమే కారణమని పౌరాణిక ప్రాశస్త్యం చెబుతోంది. సీతమ్మ తల్లి లంకలో అశోకవనంలో ఉన్నప్పుడు తన కష్టాలను గోరింటాకుతో చెప్పుకుందట. లంక నుంచి శ్రీరాముడితో తిరిగి వెళ్లేటప్పుడు వరం కోరుకొమ్మని సీతమ్మ అడిగితే, తనకు వరమొద్దని అందరి మహిళల ముఖం సీతమ్మలాగా కళకళలాడాలని కోరిందట. దీంతో గోరింటాకు చెట్టుకు పూజ చేసి, ఆకు నూరి పెట్టుకున్న మహిళలకు సుఖసంతోషాలు ఉంటాయని, మహాలక్ష్మి అనుగ్రహం ఉండేలా సీతమ్మ తల్లి అనుగ్రహించిందని చెబుతారు.

శాస్త్రీయ కారణాలు..

ఆషాఢ మాసంలో వర్షాలు కురవడం, గ్రామాల్లో మహిళలు వ్య వసాయ పనులకు వెళ్తుంటారు. దీంతో నీటిలో నానే పనులు ఎక్కువగా చేయాల్సి ఉంటుంది. దుస్తులు ఉతకడం, గిన్నెలు తోమడం లాంటి పనులతో పాటు గతంలో చెప్పుల వాడకం తక్కువ ఉన్న రోజుల్లో బురద రోడ్లలో తిరగాల్సి వచ్చేది. నేపథ్యంలో గోర్లు పాడుకాకుండా, పాదాలు పుళ్లు పడకుండా ఉండేందుకు గృహవైద్యంగా గోరింటాకును పెట్టుకుంటారు. అలాగే చర్మవ్యాధులు రాకుండా, గోళ్లు దెబ్బతినకుండా గోరింటాకు బాగా ఉపయోగపడుతుంది.



గోరింటాకు పెట్టుకుంటున్న మహిళలు

ఎంతో ప్రత్యేకత ఉంది



ఆషాఢ మాసంలో చేతులకు గోరింటాకు పెట్టుకుని మురిసిపోతూంటాం. ఆషాఢ మాసంలో ఈ గోరింటాకుకు ఎంతో ప్రత్యేకత ఉంది. ఇది ఆరోగ్యానికి చాలా ఔషధయుక్తమైంది. గోరింటాకు పెట్టుకోవడం వల్ల అనారోగ్య సమస్యలు కూడా రావు.
– నందకుమారి, వెంకటేశ్వరకాలనీ, బోధన్

మహిళలకు సౌభాగ్యం



ఆషాఢ మాసం మొదటి ఏకాదశికి గోరింటాకు వేడుక చేసుకుంటాం. మహిళలు తమ సౌభాగ్యంగా భావించి ఇంటింటా ఆషాఢంలో ఈ గోరింటాకును పెట్టుకుంటారు. మా కాలనీలో ప్రతి సంవత్సరం ఈ వేడుకలు సాంప్రదాయంగా జరుపుకుంటున్నాం.
– సౌమ్య, బోధన్

న్యూస్‌రీల్

సీజనల్ వ్యాధులపై కరపత్రాల విడుదల



నిజామాబాద్ సిటీ: వర్షాకాలం సీజనల్ వ్యాధుల నివారణపై ఐఎంఏ ఆధ్వర్యంలో ముద్రించిన కరపత్రాలను శనివారం కలెక్టర్ రాజీవ్‌గాంధీ హనుమంతు తన కార్యాలయంలో ఆవిష్కరించారు. మలేరియా, డెంగీ జ్వరాలను అవగాహనతో నివారించవచ్చన్నారు. దోమల నివారణకు ఆరోగ్య సిబ్బంది, ప్రజలందరూ కలిసి పని చేయాలని సూచించారు. కార్యక్రమంలో ఐఎంఏ జనరల్ సెక్రెటరీ డాక్టర్ జలగం తిరుపతిరావు, కోశాధికారి డాక్టర్ రాజేంద్రప్రసాద్, సహాయ కార్యదర్శి నాగమోహన్ తదితరులు పాల్గొన్నారు.

కార్మికుల సమస్యలు పరిష్కరించాలి



ఖలీల్‌వాడి : మధ్యాహ్న భోజన కార్మికుల సమస్యల పరిష్కారం కోసం 10 11 12 తేదీల్లో రాష్ట్రవ్యాప్తంగా టోకెన్ సమ్మెను నిర్వహించడాన్ని మధ్యాహ్న భోజన కార్మికులందరూ సమ్మెలో పాల్గొని జయప్రదం చేయాలని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి గోవర్ధన్ అన్నారు. శనివారం జిల్లాలో సమ్మె జయప్రదం కోసం సమ్మె నోటీస్‌ని డీఈవోకి యూనియన్ ప్రతినిధులు అందజేశారు. గోవర్ధన్ మాట్లాడుతూ సీఎం కేసీఆర్ మధ్యాహ్న భోజన కార్మికులకు రూ. 3000 చెల్లిస్తామని ప్రకటించిన హామీ అమలు కాలేదన్నారు. మధ్యాహ్న భోజన నిర్వహణను స్వచ్ఛంద సంస్థలకు అప్పజెప్పి మధ్యాహ్న భోజన కార్మికుల ఉపాధిని దెబ్బతీసే చర్యలకు పాల్పడుతుందన్నారు. వినతిపత్రం ఇచ్చిన వారిలో జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ కొండ గంగాధర్, జిల్లా అధ్యక్షురాలు చామంతి లక్ష్మి, నాయకులు సురేందర్ రెడ్డి, సుజాత, నిరంజన, స్వప్న, పర్వమ్మ, శేఖర్, సాయిలు తదితరులు పాల్గొన్నారు.

దేశ నిర్మాణంలో న్యాయవాదుల పాత్ర కీలకం



నిజామాబాద్ లీగల్ : రాజకీయ, ఆర్థిక, సామాజిక రంగాల్లో న్యాయవాదుల పాత్ర కీలకమైనదని జిల్లా ప్రధాన న్యాయమూర్తి సునీత కుంచాల అన్నారు. శనివారం నిజామాబాద్ బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జిల్లాకోర్టు ప్రాంగణంలోని సమావేశ హాల్‌లో న్యాయవాద వృత్తి, వృత్తి పరమైన నీతి అనే అంశంపై సెమినార్ నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన జిల్లా జడ్జి మాట్లాడుతూ భారత న్యాయవ్యవస్థలో మేధోసంపత్తి కలిగిన న్యాయవాదులకు అనేక మంది ఉన్నారని తెలిపారు. చట్టాలను నిరంతర అధ్యయనం చేయాలని నూతన చట్టాలను తెలుసుకోవాలన్నారు. న్యాయస్థానాలతో పాటు ప్రభుత్వ, ప్రైవేట్ రంగాలలో వృత్తి పరమైన అవకాశాలు ఉన్నాయన్నారు. ఆంగ్లంలో అనర్గళమైన పరిజ్ఞానం, బాషపై పట్టు సాధించాలని సూచించారు. బార్ అధ్యక్షుడు దేవదాస్, ప్రధాన కార్యదర్శి భాగి చరణ్, ఉపాధ్యక్షులు ఆశ నారాయణ తదితరులున్నారు.

హాజరు @ 82%

ప్రశాంతంగా గ్రూప్-4 పరీక్ష

- కలర్ ప్రింట్ హాల్‌టికెట్లు లేకపోవడంతో అనుమతి నిరాకరణ
- కంటతడి పెట్టి వెనుతిరిగిన పలువురు అభ్యర్థులు
- పరీక్ష కేంద్రాలను తనిఖీ చేసిన కలెక్టర్, అదనపు కలెక్టర్లు



నగరంలోని కాకతీయ సెంటర్‌లో అభ్యర్థుల హాల్‌టికెట్లను పరిశీలిస్తున్న సిబ్బంది

సుభాష్‌నగర్/ఖలీల్‌వాడి : తెలంగాణ రాష్ట్ర పబ్లిక్ సర్వీస్ కమిషన్ (టీఎస్‌పీఎస్సీ) శనివారం నిర్వహించిన గ్రూప్–4 పరీక్ష ప్రశాంతంగా జరిగింది. జిల్లాలో సగటున 82 శాతం మంది అభ్యర్థులు పరీక్షకు హాజరయ్యారు. కలెక్టర్ తెలిపిన వివరాల ప్రకారం.. ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు కొనసాగిన పేపర్–1 పరీక్షకు మొత్తం 39,174 మంది అభ్యర్థులకు గాను 32,342 మంది (82.55 శాతం) హాజరయ్యారు. 6,832 మంది గైర్హాజరయ్యారు. మధ్యాహ్నం 2.30 నుంచి సాయంత్రం 5 గంటల వరకు నిర్వహించిన పేపర్–2 పరీక్షకు 32,255 మంది (82.34 శాతం) హాజరు కాగా 6919 మంది గైర్హాజరయ్యారు.

పకడ్బందీగా పరీక్ష..

కట్టుదిట్టమైన పోలీసు భద్రత నడుమ ఆయా రూట్ల వారీగా ప్రశ్నపత్రాలు, ఇతర సామగ్రిని పరీక్ష కేంద్రాలకు తరలించారు. నిబంధనల ప్రకారం నిర్ణీత సమయానికి 15 నిమిషాల ముందు పరీక్ష కేంద్రాల గేట్లు మూసేశారు. అభ్యర్థుల సౌకర్యార్థం జిల్లా వ్యాప్తంగా అన్ని ప్రాంతాల నుంచి ప్రత్యేకంగా ఆర్టీసీ బస్సు సర్వీసులు అందుబాటులో ఉంచారు. ప్రతి కేంద్రం వద్ద 144 సెక్షన్ అమలు చేశారు. పరీక్ష అనంతరం అభ్యర్థుల ఓఎంఆర్ షీట్లు, ఇతర సామగ్రిని సీల్ వేసి స్ట్రాంగ్ రూమ్‌కు తరలించారు. ఈ ప్రక్రియను అదనపు కలెక్టర్ చంద్రశేఖర్ క్షేత్రస్థాయిలో ఉండి పర్యవేక్షించారు. ఆర్టీసీ ప్రయాణ ప్రాంగణాల వద్ద అభ్యర్థులకు సహాయంగా హెల్ప్‌డెస్క్‌లను ఏర్పాటు చేయడంతోపాటు పరీక్ష కేంద్రాల వద్ద సమగ్ర వివరాలు, పాటించాల్సిన నిబంధనలు క్షుణ్ణంగా తెలియజేస్తూ ఫ్లెక్సీలు ఏర్పాటు చేశారు.

పరీక్ష కేంద్రాలను తనిఖీ చేసిన కలెక్టర్

గ్రూప్–4 పరీక్ష కేంద్రాలను కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు తనిఖీ చేశారు. పరీక్ష నిర్వహణ తీరు తెన్నులను పరిశీలించారు. అభ్యర్థుల హాజరు ఆరా తీశారు. నిబంధనలకు అనుగుణంగానే నిర్ణీత సమయంలో ప్రశ్నపత్రాలను తెరిచారా? లేదా? అన్నది నిర్ధారణ చేసుకున్నారు. పరీక్ష కేంద్రాల్లోని గదులను సందర్శిస్తూ, అభ్యర్థులకు అందుబాటులో ఉంచిన సదుపాయాలను గమనించి ముఖ్య పర్యవేక్షకులకు పలు సూచనలు చేశారు. నిబంధనలు పక్కాగా అమలయ్యేలా పర్యవేక్షణ చేపట్టాలని పరీక్ష కేంద్రాల చీఫ్ సూపరింటెండెంట్లకు సూచించారు.

అదనపు కలెక్టర్ బి చంద్రశేఖర్ గూపన్‌పల్లిలో గల శ్రీ చైతన్య హైస్కూల్‌లోని సెంటర్‌ను సందర్శించారు. కలెక్టర్, అదనపు కలెక్టర్ల వెంట పరీక్ష కేంద్రాల చీఫ్ సూపరింటెండెంట్లు, లైజనింగ్ అధికారులు ఉన్నారు.

అనుమతి నిరాకరణతో కంటతడి

పరీక్ష రాసేందుకు వచ్చిన పలువురు అభ్యర్థులను వివిధ కారణాల రీత్యా కేంద్రాల్లోకి అధికారులు అనుమతించలేదు. కలర్ ప్రింట్ హాల్‌టికెట్లు లేకపోవడంతో కొందరిని, హాల్‌టికెట్‌తోపాటు గుర్తింపు కార్డు తీసుకురాలేకపోయిన వారిని, సమయానికి కేంద్రం వద్దకు చేరుకోకపోవడంతో ఇంకొందరిని పరీక్ష కేంద్రాల్లోకి అనుమ తించలేదు. నగరంలోని ఎస్‌వీ కళాశాల, కాకతీయ, విశ్వశాంతి, ఎస్ఆర్ కళాశాలతోపాటు మరికొన్ని కళాశాలల వద్ద వివిధ కారణాలతో అభ్యర్థులకు అనుమతి నిరాకరించడంతో కంటతడి పెట్టుకుని అభ్యర్థులు వెనుదిరిగారు.



ఐడీకార్డు లేకపోవడంతో పరీక్షకు అనుమతించని మహిళా పోలీసును వేడుకుంటున్న అభ్యర్థిని



పరీక్ష కేంద్రంలో తల్లి.. బయట లాలిస్తున్న తండ్రి..

వైద్యంలో దేశానికే ఆదర్శం



జీజీహెచ్‌లో ఈసీజీ యంత్రాన్ని ప్రారంభిస్తున్న జెడ్పీ చైర్మన్ విఠల్‌రావు



వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న జెడ్పీ చైర్మన్, మెడికల్ కాలేజీ ప్రిన్సిపాల్, డీఎంహెచ్‌వో

- ప్రభుత్వ జనరల్ ఆస్పత్రిలో అందుబాటులోకి 134 రకాల పరీక్షలు
- జెడ్పీ చైర్మన్ దాదన్నగారి విఠల్‌రావు

నిజామాబాద్ సిటీ: వైద్య రంగంలో తెలంగాణ దేశానికే ఆదర్శంగా నిలుస్తోందని జెడ్పీ చైర్మన్ దాదన్నగారి విఠల్‌రావు అన్నారు. శనివారం నిజామాబాద్ ప్రభుత్వ జనరల్ ఆస్పత్రిలో తెలంగాణ డయాగ్నోస్టిక్ టీహబ్‌లో రక్త మూత్ర, ఇతర 57 రకాల పరీక్షల నుంచి 134 రకాల పరీక్షలకు పెంచిన సందర్భంగా రేడియాలాజీ హబ్‌కు సంబంధించిన పరికరాలు, మామోగ్రామ్ పరీక్ష కేంద్రం, అల్ట్రా సౌండ్ తదితర పరీక్ష కేంద్రాలను జెడ్పీ చైర్మన్ విఠల్‌రావు, మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఇందిరా, డీఎంహెచ్‌వో డాక్టర్ సుదర్శనం, ఆస్పత్రి సూపరింటెండెంట్ ప్రతిమారాజ్‌లు ప్రారంభించారు. ఈ సందర్భంగా జెడ్పీ చైర్మన్ మాట్లాడుతూ నిజామాబాద్ ప్రభుత్వ జనరల్ ఆస్పత్రిలో 134 రకాల వైద్య పరీక్షలను ఉచితంగా చేయడం జరుగుతుందన్నారు. జీజీహెచ్‌కు దాదాపు రూ. 6 కోట్ల పరికరాలు పంపించడం చాలాసంతోషంగా ఉందన్నారు. ఆస్పత్రిలో ఉన్న వైద్య పరికరాలు ఇతర ప్రైవేటు ఆస్పత్రుల్లో లేవన్నారు. ప్రజలు ఈ అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

ప్రజలు సద్వినియోగం చేసుకోవాలి

టీ హబ్‌లో భాగంగా జనరల్ ఆస్పత్రిలో 134 రకాల వైద్య పరీక్షలను ఉచితంగా నిర్వహించనున్నామని, ప్రజలు వీటిని సద్వినియోగం చేసుకోవాలని ఆస్పత్రి సూపరింటెండెంట్ ప్రతిమారాజ్ అన్నారు. ప్రభుత్వ ఆస్పత్రిలో ఎలక్ట్రానిక్ హెల్త్ ఇన్ఫ్మారేషన్ సిస్టమ్, తెలంగాణ రేడియో డయాగ్నోస్టిక్ హబ్‌ను ప్రారంభించుకోవడం జరిగిందన్నారు. జెడ్పీ చైర్మన్‌కు సంబంధించి ఆరోగ్య వివరాలు మొట్టమొదటగా రికార్డు చేశామన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ సూపరింటెంటెండ్ బాల్‌రాజ్, ఏడీ సంతోష్, సర్పంచ్‌ల ఫోరం అధ్యక్షుడు శ్రీనివాస్, పాథలాజికల్ మెడికల్ ఆఫీసర్ దివ్య, వైద్యులు పాల్గొన్నారు.

త్వరలో నిజామాబాద్‌కు వస్తా..
– మంత్రి హరీశ్‌రావు

వైద్యుల దినోత్సవం సందర్భంగా టీహబ్‌ను ప్రారంభించుకోవడం సంతోషంగా ఉందని వైద్య ఆరోగ్యశాఖ మంత్రి హరీశ్‌రావు అన్నారు. టీ హబ్ ప్రారంభోత్సవం సందర్భంగా హైదరాబాద్‌నుంచి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా నిర్వహించిన కార్యక్రమంలో మంత్రి జెడ్పీ చైర్మన్‌తో మాట్లాడారు. నిజామాబాద్‌కు ఎంఆర్ఐ కావాలని జెడ్పీ చైర్మన్ మంత్రిని కోరగా.. త్వరలో మంజూరు చేస్తామని, తాను త్వరలో నిజామాబాద్ ఆస్పత్రిని సందర్శిస్తానని తెలిపారు. మోకాల్ చిప్పల మార్పిడి ఆపరేషన్లు ఎందుకు తగ్గాయని మంత్రి సూపరింటెండెంట్‌ను ప్రశ్నించారు. వేసవికాలం కావున ఆపరేషన్లు తగ్గాయని, జూలైలో పెంచుతామన్నారు.

జాతీయ రహదారిపై రోడ్డు ప్రమాదం

- ఒకరి మృతి, ఎనిమిది మందికి గాయాలు
- ఒకరి పరిస్థితి విషమం
- బీహార్‌కు చెందిన హమాలీలు

బాల్కొండ : ముప్కాల్ మండలం వేంపల్లి శివారులో జాతీయ రహదారి 44పై శనివారం తెల్లవారు జామున లారీని బొలెరో వాహనం వెనుక నుంచి ఢీకొట్టడంతో ఒకరు మృతి చెందారు. ఎనిమిది మందికి గాయాలయ్యాయి. అందులో ఒకరి పరిస్థితి విషమంగా ఉంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం .. సిద్దిపేట జిల్లా కేంద్రంగా కోళ్ల పౌల్ట్రీ ఫారాలలో పనిచేస్తున్న తొమ్మిది మంది బీహార్ కూలీలు సొంత గ్రామాలకు వెళ్తుండగా ఈ ప్రమాదం జరిగింది. బోలేరో వాహనం డ్రైవర్ అజాగ్రత్త, నిర్లక్ష్యం వలన వెనుక నుంచి అతి వేగంగా రన్నింగ్‌లో ఉన్న లారీని ఢీ కొట్టింది. బొలేరో లారీ కిందకు చొచ్చుకు పోయింది. దీంతో బోలేరో డ్రైవర్ శ్యాంసుందర్ యాదవ్‌కు, ఆయన పక్కన కుర్చున్న హమాలీల మొకాద్దం (హమాలీలో పెద్ద) గోమర్తి రాజు (39)కు తీవ్ర గాయాలయ్యాయి. వెనుక కూర్చున్న వాళ్లకు స్వల్ప గాయాలయ్యాయి. వీరందరిని నేషనల్ హైవే అంబులెన్స్‌లో జిల్లా కేంద్ర ప్రభుత్వాస్పత్రికి తరలించగా రాజు చికిత్స పొందుతూ మృతి చెందాడు. పరిస్థితి విషమంగా ఉన్న డ్రైవర్ శ్యాంసుందర్ యాదవ్‌ను ప్రయివేటు ఆస్పత్రిలో చేర్పించారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ముప్కాల్ ఎస్సై భాస్కర్ చారి తెలిపారు.

తరచూ ప్రమాదాలు

బాల్కొండ మండల కేంద్రం నుంచి ముప్కాల్ వరకు జాతీయ రహదారి 44 విస్తరణలో బైపాస్ గుండా రోడ్డును నిర్మించారు. ఆ రోడ్డుపై అతి వేగంగా వాహనాలను నడుపుతూ ప్రమాదాలకు గురవుతున్నారు. ఏడాది కాలంలో జరిగిన నాలుగు ప్రమాదాలు అతివేగం, అజాగ్రత్త వలన జరిగినవే కావడం గమనార్హం. గతేడాది జూలైలో జాతీయ రహదారి పై లారీ ఆపి పంక్చర్ అయిన టైరు మార్చుతుండగా వెనుక నుంచి వచ్చిన కంటెయినర్ వేగంగా ఢీ కొట్టడంతో ఇద్దరు అక్కడిక్కడే మృతి చెందారు. ఆగష్టులో ముప్కాల్ మండలం కొత్తపల్లి శివారులో జాతీయ రహదారి పై హైదరాబాద్ నుంచి మహారాష్ట్ర వార్ధలోని శుభకార్యానికి కారులో వెళ్తుండగా కారు అదుపు తప్పి పల్టీలు కొట్టిన ఘటనలో నలుగురు మృతి చెందారు. అందులో మూడు నెలల పాప కూడా మృతి చెందింది. అంతకు ఇరవై గంటల ముందు మెండోరా మండలం బుస్సాపూర్‌లో జాతీయ రహదారిపై ఆగిఉన్న బైక్‌ను లారీ అతి వేగంగా ఢీ కొట్టడంతో ఇద్దరు యువకులు అక్కడిక్కడే మృతి చెందారు. రెండు నెలల క్రితం వేంపల్లి వద్ద జాతీయ రమదారిపై గుర్తు తెలియని మహిళపై అతి వేగంగా వాహనం వెళ్లడంతో ఆమె రోడ్డుకు అతుక్కుపోయింది. ఇలా జాతీయ రహదారిపై అనేక ప్రమాదాలు జరుగుతున్నాయి.



గాయపడిన రాజు(చికిత్స పొందుతూ మరణించాడు)



క్షతగాత్రులను బయటకు తీస్తున్న స్థానికులు

క్లుప్తంగా

పరీక్ష కేంద్రాలను పరిశీలించిన ఇన్‌చార్జి సీపీ



ఖలీల్‌వాడి: జిల్లా కేంద్రంలో శనివారం నిర్వహించిన గ్రూప్–4 పరీక్ష కేంద్రాలను ఇన్‌చార్జి సీపీ ప్రవీణ్‌కుమార్ పరిశీలించారు. కమీషనరేట్ పరిధిలో 125 పరీక్ష కేంద్రాలు ఉన్నాయని పేర్కొన్నారు. కేంద్రాల వద్ద పటిష్టమైన బందోబస్తు ఏర్పాటు చేశామన్నారు. బందోబస్తులో డీసీపీ(అడ్మిన్), ఏసీపీలు ముగ్గురు, సీఐలు, ఆర్‌ఐలు 19 మంది, ఎస్సైలు, ఆర్‌ఎస్సైలు 48 మంది, ఏఎస్సై, హెడ్‌కానిస్టేబుళ్లు 64 మంది, పోలీస్‌కానిస్టేబుళ్లు, హోమ్‌గార్డులు 140 మంది, మహిళ సిబ్బంది 83 మంది, ఇతర విభాగాలకు చెందిన 48 మంది పాల్గొన్నట్లు చెప్పారు.

3 నుంచి పీజీ సెకండియర్ పరీక్షలు

సుభాష్‌నగర్: డాక్టర్ బీఆర్ అంబేద్కర్ ఓపెన్ యూనివర్శిటీలో పీజీ ద్వితీయ సంవత్సరం పరీక్షలు ఈనెల 3 నుంచి ప్రారంభం కానున్నాయని గిరిరాజ్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ రామ్మోహన్‌రెడ్డి, అధ్యయన కేంద్ర రీజినల్ కోఆర్డినేటర్ కె రంజిత ఒక ప్రకటనలో తెలిపారు. విద్యార్థులు వారి హాల్‌టికెట్లను నెట్ నుంచి డౌన్‌లోడ్ చేసుకోవాలని, దాంతోపాటు వారి ఫొటోతో ఉన్న గుర్తింపు కార్డు తప్పనిసరిగా తీసుకురావాలని సూచించారు. పరీక్షలు మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 5 గంటల వరకు ఉంటాయన్నారు. పరీక్ష రాసే విద్యార్థులు అరగంట ముందే పరీక్షాకేంద్రానికి చేరుకోవాలన్నారు.

జాతీయ సహకార కాంగ్రెస్‌కు డీసీసీబీ చైర్మన్



సుభాష్‌నగర్ : ఢిల్లీలో జరుగుతున్న 17వ జాతీయ సహకార కాంగ్రెస్‌కు ఎన్‌ఏఎఫ్‌ఎస్‌సీఓబీ, టీఎస్ క్యాబ్ చైర్మన్ కొండూరు రవీందర్ రావు, సహకార చైర్మన్లతో కలిసి ఉమ్మడి నిజామాబాద్ జిల్లా డీసీసీబీ చైర్మన్ పోచారం భాస్కర్‌రెడ్డి శనివారం హాజరయ్యారు. కేంద్ర హోం, సహకార శాఖ మంత్రి అమిత్‌షా అధ్యక్షతన సిరిపోర్ట్ ఆడిటోరియంలో రెండు రోజుల పాటు సదస్సు జరుగనుంది. సదస్సును శనివారం ప్రధాన మంత్రి మోదీ ప్రారంభించి ప్రసంగించారు.

ప్రశాంతంగా గ్రూప్ 4 పరీక్ష



అభ్యర్థులను తనిఖీ చేస్తున్న పోలీసులు

ఉమ్మడి జిల్లాలో గ్రూప్–4 పరీక్ష ప్రశాంతంగా జరిగింది. కేంద్రాల వద్ద ఇబ్బందులు తలెత్తకుండా అధికారులు ఏర్పాట్లు చేశారు. పలువురు మహిళలు చిన్నారులతో పరీక్ష కేంద్రాలకు వచ్చారు. వారు పరీక్ష రాయడానికి వెళ్లగా కుటుంబ సభ్యులు చిన్నారులను ఆడించారు.

– సాక్షి స్టాఫ్ ఫొటోగ్రాఫర్, నిజామాబాద్/ కామారెడ్డి టౌన్





పరీక్ష కేంద్రానికి వెళ్తున్న అభ్యర్థులు



నిజామాబాద్‌లోని కాకతీయ పరీక్ష కేంద్రం వద్ద హాల్‌టికెట్ నంబర్ చూసుకుంటున్న అభ్యర్థులు



నిజామాబాద్ ఎస్ఎస్ఆర్ కళాశాల వద్ద అభ్యర్థులను చెక్ చేస్తున్న అధికారులు



కామారెడ్డిలో పరీక్ష కేంద్రంలోకి వెళ్తున్న అభ్యర్థి



కామారెడ్డిలో..



కామారెడ్డిలో ఆధార్‌కార్డు లేకపోవడంతో సెంటర్ బయట ఉన్న మహిళ

పిల్లలకు పరీక్ష







నిజామాబాద్ నగరంలో..







కామారెడ్డిలో..

రైతులకు పెట్టుబడి భారం

- పెరుగుతున్న సాగు ఖర్చులు
- ఆందోళనలో అన్నదాతలు

బాన్సువాడ: యాసంగిలో బాన్సువాడకు చెందిన రైతు గంగారం నాలుగు ఎకరాల వ్యవసాయ భూమిని కౌలుకు తీసుకుని పంట సాగు చేశాడు. పెట్టుబడి డబ్బులు పోను తనకు ఇంకా రూ.24 వేలు నష్టం వచ్చింది. దీంతో వానాకాలం సాగుకు ఆసక్తి చూపడం లేదు. వ్యవసాయంలో పెట్టుబడి ఏటేటా పెరుగుతోంది. దీంతో గిట్టుబాటు కాక అన్నదాత అవస్థలు పడుతున్నాడు. ట్రాక్టర్ల యజమానులు కిరాయిలు పెంచారు. ప్రస్తుతం రైతులు విత్తనాలు వేసేందుకు సిద్ధమవుతుండగా ధరల మోతతో ఆందోళన చెందుతున్నారు. ఏటేటా పెట్టుబడి భారం కావడంతో పంట సాగు చేయడానికి ఆసక్తి కనబర్చడం లేదు. దీనికి తోడు అకాల వర్షాలు, పంటకు తెగుళ్ల బెడద తదితర ఇబ్బందులను రైతులు ఎదుర్కొంటున్నారు. విత్తనాలు, ఎరువుల ధరలు, కూలీల రేట్లు ఎక్కువగా ఉండడంతో రైతుల ఆర్థిక పరిస్థితి ఇబ్బందులను గురి చేస్తోంది. చాలా మంది రైతులు ట్రాక్టర్లనే వ్యవసాయ పనులకు ఉపయోగిస్తున్నారు. ఏడాది క్రితం ఎకరానికి సాలుకు రూ.800 నుంచి రూ.1000 వరకు వసూలు చేసిన ట్రాక్టర్ యజమానులు ప్రస్తుతం ఎకరానికి రూ.1300 నుంచి రూ.1500 వరకు వసూలు చేస్తున్నారు. ఇలా ఒక్కసారి పంట సాగు చేయాలంటే ఎకరానికి నాలుగు సార్లు దుక్కి, దమ్ము చేయాల్సి ఉంటుంది. ఇలా రైతులపై తీవ్ర భారం పడుతుంది. పంటకు విత్తనం నాటిప్పటి నుంచి పంట కోత దశ వరకు పెట్టుబడికి కావాల్సిన డబ్బుల కోసం రైతులు వడ్డీ వ్యాపారులను ఆశ్రయిస్తున్నారు. అయిన అప్పు పుట్టని స్థితి. కొందరు వడ్డీ వ్యాపారులు రైతులకు అంటేనే అప్పు ఇవ్వమని మోకంపై తేల్చి చెబుతున్నారు. మరి కొంత మంది వడ్డీ వ్యాపారులు వ్యవసాయ భూములను సెల్‌డీడ్ చేసుకుని రూ. 3 నుంచి రూ. 5 వరకు వడ్డీ వసూలు



చేస్తు అప్పు ఇస్తున్నారు. తప్పని పరిస్థితుల్లో రైతులు అప్పులు చేయాల్సి వస్తుంది. ఎరువుల దుకాణాల్లో ఉద్దెరకు ఎరువులను కొనుగోలు చేస్తే పంట విక్రయించిన తర్వాత వడ్డీతో సహా ఎరువుల డబ్బులను వసూలు చేస్తున్నారు.

రూపాయి మిగలలేదు

యాసంగిలో వడగళ్ల వర్షాల కారణంగా పంటలు పూర్తిగా నష్టపోయాం. ఈ సారి దిగుబడి పూర్తిగా తగ్గిపోయింది. రెండెకరాలను కౌలు తీసుకుని వ్యవసాయం చేశాను. కౌలు చేసిన పాపానికి రూపాయి మిగలలేదు. తిరిగి నష్టపోవాల్సి వచ్చింది. ఎక్కడైనా జీతం ఉంటే నెలకు కనీసం రూ.20 వేలు సంపాదించే వాణ్ని. ఇకపై పంట సాగు జోలికి వెళ్లను.

– సాయిలు, రైతు, బాన్సువాడ

వేకువజాము నుంచే ఇసుక దందా

- అధికారులు రాకముందే తరలిస్తున్న వైనం

మోర్తాడ్(బాల్కొండ): మోర్తాడ్ మండలం సుంకెట్‌లో ఇసుక మాఫియా రాజ్యం ఏలుతోంది. ఇసుక పాయింట్ నుంచి రవాణా ఆరంభించడానికి ఉదయం 9 గంటల తరువాత సమయం ఉన్నా వ్యాపారులు మాత్రం వేకువ జామునే ట్రాక్టర్లలో ఇసుకను నింపుకుని యథేచ్ఛగా తరలించడం మొదలు పెట్టారు. ఇసుక రవాణా విషయంలో ఎన్నో వివాదాలకు హేతువైన సుంకెట్ పాయింట్ నుంచి ఇసుకను రవాణా చేసే విషయంలో అధికారులు తప్పటడుగులు వేయడం వ్యాపారులకు కలిసి వస్తుంది. నిబంధనల ప్రకారం వే బిల్లులు రాసిన తర్వాతే ఇసుకను తరలించాల్సి ఉన్నా వ్యాపారులు మాత్రం అదేమి లెక్కచేయకుండా తమకు ఇష్టం వచ్చినట్లు రవాణా కొనసాగిస్తున్నారు. సుంకెట్‌కు చెందిన ముగ్గురు అధికార పార్టీ నాయకులే ఇసుక వ్యాపారులుగా అవతారం ఎత్తి తమకు తోచినట్లుగా దందా కొనసాగిస్తున్నారు. గ్రామంలో నుంచి ఇసుకను రవాణా చేయవద్దని కొందరు పౌరులు సూచించినా లెక్కచేయలేదు. అంతేకాకుండా ఇసుక రవాణా విషయంలో మరో మార్గం అనుసరిస్తే ఇతర గ్రామాల వాహనాలు వచ్చి తమకు ఎక్కడ పోటీ ఇస్తాయో అని ముగ్గురు వ్యాపారులు సందేహిస్తున్నారు. దీంతో ఇసుక పాయింట్‌పై తమ పెత్తనం కొనసాగిస్తున్నారు. ఉన్నతాధికారులు స్పందించి సుంకెట్ ఇసుక పాయింట్‌పై సమగ్ర విచారణ జరిపించాలని పలువురు కోరుతున్నారు.



ఉదయం ఏడు గంటలకే మోర్తాడ్ జాతీయ రహదారి వైపు వస్తున్న ఇసుక ట్రాక్టర్



పోస్టల్ ఇన్సూరెన్స్ పథకాలపై అవగాహన

బోధన్: మండల న్యాయ సేవాధికార సంస్థ, పోస్టల్ శాఖ ఆధ్వర్యంలో శనివారం పట్టణ కేంద్రంలోని కోర్టు ప్రాంగణంలో పోస్టల్ ఇన్సూరెన్స్ పథకాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. బోధన్ కోర్టు ఐదో అదనపు జిల్లా న్యాయమూర్తి రవికుమార్ మాట్లాడారు. సీనియర్ సివిల్ జడ్జి అజయ్ కుమార్, ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి రుబి నా ఫాతిమా, పబ్లిక్ ప్రాసిక్యూటర్లు, న్యాయవాదులు, పోస్టల్ శాఖ అధికారులు పాల్గొన్నారు.

వెబ్‌సైట్‌లో అర్హుల జాబితా

సుభాష్‌నగర్: సమగ్ర శిక్షలో కాంట్రాక్ట్ పద్ధతిన పని చేసేందుకు 2019లో జారీ చేసిన నోటిఫికేషన్‌కు సంబంధించి అభ్యర్థుల ప్రొవిజినల్ జాబితాలను డీఈవో నిజామాబాద్ వెబ్‌సైట్‌లో ఆదివారం ప్రదర్శిస్తామని డీఈవో దుర్గాప్రసాద్ ఒక ప్రకటనలో తెలిపారు. జాబితాలోని అభ్యర్థులు సోమవారం ఉదయం 10 నుంచి కొత్త కలెక్టరేట్‌లోని హాల్‌నెంబర్ 117లో ఒరిజినల్ సర్టిఫికెట్లు, ఒక సెట్ జిరాక్స్ కాపీ తీసుకొచ్చి వెరిఫికేషన్ చేయించుకోవాలన్నారు.

పోలీసులకు శిక్షణ




ఖలీల్‌వాడి: నిజామాబాద్ డివిజన్‌లోని పోలీస్, ఎక్సైజ్ అధికారులకు నిజామాబాద్ ప్రాసిక్యూటర్ భూసారపు రాజేష్ గౌడ్ శనివారం అవగాహన కల్పించారు. పంచనామా, చార్జీషీట్, రిమాండ్ రిపోర్టులు కోర్టులో దాఖలు చేసే విధానం గురించి వివరించారు. ప్రాసిక్యూటర్ రహీమోద్దీన్, పబ్లిక్ ప్రాసిక్యూటర్లు రవిరాజ్, కవితారెడ్డి, ఎక్సైజ్ ఆఫీసర్ సింధు, టాస్క్‌ఫోర్స్ ఆఫీసర్ గంగాధర్ తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు మరమ్మతులతో ట్రాఫిక్ జామ్

- అడవి మామిడిపల్లి వద్ద మూడు గంటలు స్తంభించిన వాహనాలు

మాక్లూర్: మండలంలోని అడవి మామిడిపల్లి రైల్వే ఓవర్ బ్రిడ్జి వద్ద కొనసాగుతున్న రోడ్డు మరమ్మతుల కారణంగా 63వ నంబర్ జాతీయ రహదారిపై శనివారం సాయంత్రం సుమారు 3 గంటలపాటు ట్రాఫిక్ జామ్ అయింది. ఎక్కడి వాహనాలు అక్కడే నిలిచిపోయి ప్రజలు ఇబ్బంది పడ్డారు. అడవి మామిడిపల్లి వద్ద జాతీయ రహదారిపై రైల్వే ఫ్లైఓవర్ బ్రిడ్జి పనులు ఇటీవల పూర్తయ్యాయి. ఈ పనులతో ఇరువైపులా సుమారు 2 కిలోమీటర్ల మేర రోడ్డు ధ్వంసమైంది. కాంట్రాక్టర్ రోడ్డుకు మరమ్మతులు చేపడుతున్నాడు. దీంతో ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడుతోంది. శనివారం అటు అంకాపూర్, ఇటూ నిజామాబాద్ వరకు వాహనాలు నిలిచిపోయాయి. విషయం తెలుసుకున్న మాక్లూర్ ఎస్సై యాదగిరిగౌడ్ సిబ్బందితో వెళ్లి ట్రాఫిక్‌ను క్లియర్ చేశారు. ట్రాఫిక్ క్లియర్ కావటానికి సుమారు 3 గంటలు పట్టింది. మరోవైపు రోడ్డు మరమ్మతు పనులను కాంట్రాక్టర్ నత్తనడకన చేస్తున్నట్లు ప్రజలు ఆరోపిస్తున్నారు. దీంతో ఇబ్బందులు పడుతున్నామని, పనులు వేగంగా పూర్తి చేయాలని కోరుతున్నారు.



నిలిచిపోయిన వాహనాలు

క్రైం కార్నర్

చికిత్స పొందుతూ చిన్నారి మృతి

- వైద్యుల నిర్లక్ష్యమే కారణమంటూ బంధువుల ఆందోళన

కామారెడ్డి టౌన్: కామారెడ్డిలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న మూడేళ్ల చిన్నారి మృతి చెందింది. వైద్యుల నిర్లక్ష్యమే కారణమంటూ బంధువులు ఆందోళనలకు దిగారు. వివరాలు ఇలా ఉన్నాయి. రామారెడ్డి మండలం అన్నారం గ్రామానికి చెందిన రమేష్, హర్థికల మూడేళ్ల చిన్నారి మనుశ్రీ తీవ్రమైన జ్వరం, విరోచనాలతో బాధపడటంతో గ్రామంలోని వైద్యునికి చూపించారు. అయినా తగ్గకపోవడంతో శుక్రవారం జిల్లా కేంద్రంలోని దర్శశాల పక్కన ఓ ప్రైవేట్ చిన్న పిల్లల దవాఖానాలో అడ్మిట్ చేశారు. ఆస్పత్రిలో వైద్యులు చికిత్స చేస్తుండగానే చిన్నారికి శనివారం మధ్యాహ్నం ఫిట్స్ వచ్చింది. వైద్యులు తీవ్రంగా శ్రమించినా ఫలితం దక్కలేదు. అనంతరం చికిత్స పొందుతూ మనుశ్రీ మృతి చెందింది. చిన్నారి మృతికి వైద్యుల నిర్లక్ష్యమే కారణమంటూ తల్లిదండ్రులు, బంధువులు ఆస్పత్రి ముందు ఆందోళన చేశారు. వైద్యులతో వాగ్వాదం చేశారు. పట్టణ పోలీసులు ఆందోళనకారులను సముదాయించారు. పాపను బతికించడానికి తాము తీవ్రంగా శ్రమించామని, తీవ్రమైన జ్వరం, ఫిట్స్ రావడం, మెదడులో రక్తం గడ్డకట్టడంతోనే చిన్నారి మృతి చెందిందని వైద్యులు చెప్పారు.



ఆస్పత్రి బయట రోదిస్తున్న కుటుంబ సభ్యులు, బంధువులు



మనుశ్రీ (ఫైల్)

గుండెపోటుతో ఒకరు..



నవీపేట: మండల కేంద్రంలోని దర్యాపూర్ కాలనీకి చెందిన తిరునగరి నరసింహ స్వామి (45) గుండెపోటుతో శనివారం మృతి చెందినట్లు గ్రామస్తులు తెలిపారు. జిల్లా కేంద్రంలోని ఓ కంపెనీలో ప్రైవేట్ ఉద్యోగిగా విధులు నిర్వహిస్తున్న సమయంలో గుండెపోటుకు గురైనట్లు పేర్కొన్నారు. తోటి ఉద్యోగులు హాస్పిటల్‌కు తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందాడని పేర్కొన్నారు. మృతునికి భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు.

రుద్రూర్‌కు చెందిన వీఆర్‌ఏ..

రుద్రూర్: రుద్రూర్ మండల కేంద్రానికి చెందిన వీఆర్‌ఏ గైని బాబు (55) గుండెపోటుతో శనివారం మృతి చెందాడు. మధ్యాహ్నం భోజనం చేస్తున్న సమయంలో వెక్కిళ్లు రావడంతో శ్వాస తీసుకోవడం ఇబ్బందిగా మారి పడిపోయాడు. చికిత్స నిమిత్తం సహచరులు వెంటనే బోధన్ ప్రభుత్వాసుపత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యుడు గుండెపోటుతో మృతి చెందాడని చెప్పినట్లు రెవెన్యూ సిబ్బంది తెలిపారు. తహసీల్దార్ ముజీబ్, రెవెన్యూ సిబ్బంది సంతాపం తెలిపి, బాధిత కుటుంబాన్ని ఓదార్చారు.

సోయా చోరీ కేసులో ఇద్దరి అరెస్టు

బిచ్కుంద: సోయాబీన్ దొంగలించి అమ్ముకున్న ఇద్దరిని పట్టుకొని శనివారం రిమాండ్‌కు తరలించినట్లు ఎస్సై శ్రీధర్‌రెడ్డి తెలిపారు. మండలంలోని సిర్‌సముందర్ గ్రామంలో రైతు రవెళ్ల రవికుమార్ సోయాబీన్ గిట్టుబాటు ధర లేదని ఇంటి దగ్గర పాలీథీన్ కవర్లు కవర్లు కప్పి నిల్వ పెట్టుకున్నాడు. సోయా బస్తాలను హజ్గుల్‌కు చెందిన తుతురు లింగురాం, బిచ్కుందకు చెందిన మచ్కురీ విజయ్ ఎత్తుకెళ్లారు. కొన్ని రోజుల నుంచి ప్రతి రోజు బైక్‌పై రాత్రి సమయంలో సోయా బస్తాలు ఎత్తుకెళ్లారు. సుమారు 40 బస్తాలు చోరీ చేసి అమ్ముకున్నారు. నిందితులపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించామని ఎస్సై తెలిపారు.

ఆలయంలో చోరీ

ఇందల్వాయి: మండలంలోని గన్నారం శివారులో 44వ నంబరు జాతీయ రహదారిపై ఉన్న శ్రీకృష్ణ ఆలయంలో శుక్రవారం రాత్రి దొంగలు పడ్డట్లు ఆలయ కమిటీ చైర్మన్ శ్రీనివాస్ తెలిపారు. పది రోజుల క్రితం గుడి తలుపులు పగలకొట్టి సీసీ కెమెరాలు, టీవీ ఎత్తుకెళ్లిన దొంగలు, ఈ సారి కూడా తాళాలు ధ్వంసం చేసి హుండీలో ఉన్న డబ్బులు, ఆలయంలో ఉన్న ఇత్తడి గంటలు ఎత్తుకెళ్లినట్లు తెలిపారు. చోరీపై పోలీసులకు ఫిర్యాదు చేశామన్నారు.

లిబర్టీ హైస్కూల్ మూసివేత



సుభాష్‌నగర్: నగరంలోని పాత ఎన్‌జీవోస్ కాలనీ లోగల లిబర్టీ హైస్కూల్ నిబంధనలకు విరుద్ధంగా కొనసాగుతున్నందున ఎంఈఓ ద్వారా తాత్కాలికంగా మూసేసినట్లు డీఈఓ దుర్గాప్రసాద్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. నిబంధనలకు విరుద్ధంగా నడుపుతున్నారని ఫిర్యాదులు వచ్చిన విషయం తెలిసిందే. ఈవిషయాన్ని అందరూ గమనించాలని ఆయన పేర్కొన్నారు.

దాడికి పాల్పడిన పది మంది రిమాండ్

రాజంపేట: రాజంపేటలో శుక్రవారం భూ తగాదాల్లో నాయిని శ్రీనివాస్‌పై దాడికి పాల్పడిన 10 మందిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై రాజు తెలిపారు. నిందితులను శనివారం కోర్టులో హాజరుపరచగా న్యాయమూర్తి వారికి 14 రోజుల రిమాండ్ విధించారని చెప్పారు.